క్లుప్తంగా

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



నందిగామ: సంక్రాంతి పండగ ప్రజలకు సర్వ శుభాలు కలగజేయాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు. పండగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

జమ్మవరం(వీరులపాడు): మండలంలోని జమ్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామ కమిటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న పోటీలకు మంచి స్పందన వస్తోందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. క్రీడాకారులకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా శాంతి కల్యాణోత్సవం



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేం చేసి ఉన్న భవానీ ముక్తేశ్వరస్వామి వారి ఆలయంలోని దత్తత ఆలయం చెన్నకేశవ స్వామి వారి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని శనివారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీధరాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేక మండపంపై ఉంచి శాంతి కల్యాణోత్సవం జరిపారు. లోక కల్యాణార్థం శాంతి కళ్యాణం సంప్రదాయంగా నిర్వహించామని తెలిపారు. స్వామి వారికి కేసీపీ తరఫున ప్రతినిధి ప్రసాద్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కేసీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలు శాంతియుతంగా నిర్వహించాలి



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను నిర్వాహకులు శాంతియుతంగా నిర్వహించాలని సీఐ నాగమురళి పేర్కొన్నారు. గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కబడ్డీ, ముగ్గుల పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే క్రీడల్లో పాల్గొని రాణించాలన్నారు. అంతేకాకుండా నిర్వాహకులు కూడా ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా క్రీడలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం క్రీడాకారులతో కొద్దిసేపు కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నబాబు, నిర్వాహకులు సోమోజు నాగమణి, దంతాల వెంకటేశ్వర్లు, లింగారావు తదితరులు పాల్గొన్నారు.

చల్లంరాజు సత్రం అభివృద్ధికి కృషి చేస్తా

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): రాష్ట్ర దేవదాయ శాఖ పరిధిలోని చల్లంరాజు వెంకటశేషయ్య ధర్మ సత్రం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సత్రం వ్యవస్థాపకురాలు తుమ్మలపల్లి దుర్గమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని సత్రం ప్రాంగణంలో అధికారులు, పాలకవర్గం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్రదానం, అనాథలకు దుప్పట్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలను ఎమ్మెల్యే వెలంపల్లి ప్రారంభించారు. ఈఓ సత్యప్రసాద్‌బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

భోగభాగ్యాలు ఇచ్చే భోగి



పెనుగంచిప్రోలులో భోగి మంటలు వేస్తున్న యువత, మహిళలు



పెనుగంచిప్రోలు వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో వేడుకలు

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా భోగి పండగను ప్రజలు శనివారం ఆనందోత్సాహాల నడుమ సందడిగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్ది, గొబ్బెమ్మలు పెట్టారు. తెల్లవారుజామున భోగి మంటలు వేశారు. పిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అందరూ సందడి చేశారు. పలు గృహాలు, అపార్ట్‌మెంట్లలో బొమ్మల కొలువులు ఏర్పాటుచేశారు. చిన్నారులపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.

పోలీస్‌స్టేషన్‌లో సంక్రాంతి సంబరాలు

పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో మహిళా పోలీస్ సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్ట్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఈశ్వర ప్రగడ రంగారావు బహుమతులను అందజేశారు. అనంతరం పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేసి సంబరాలు నిర్వహించారు. ఎస్‌హెచ్ఓ సతీష్ ఆధ్వర్యాన నిర్వహించిన వేడుకల్లో ఎస్సైలు సురేష్ , రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో భోగి వేడుకలు

పెనుగంచిప్రోలు: భోగ భాగ్యాలు కలగాలని కోరుతూ శనివారం ప్రజలు మండలంలో భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునే పలువురు యువతులు, చిన్నారులు కుటుంబ సభ్యులతో ఇళ్ల ముందు భోగిమంటలు వేశారు. లోగిళ్లలో రంగులతో రంగవల్లులు వేసి భోగి శుభాకాంక్షలు తెలియజేశారు. పిండివంటల ఘుమఘుమలు, బంధువులతో ఇళ్లు కళకళలాడాయి. మహిళలు ఇళ్ల ముందు అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని భోగి ఉత్సవాలతో పాటు పలు రకాల కార్యక్రమాలు చేపట్టారు.

మక్కపేటలో..

భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని వత్సవాయి మండలం మక్కపేట గ్రామంలో శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో భోగి మంటలు వేయటంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు మల్లెల గాంధీ, కన్నెగంటి సత్యనారాయణ, కొమరగిరి శ్రీనివాస్, లింగాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో సంబరాలు..

జగ్గయ్యపేట: మండలంలోని ప్రజలు భోగి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే భోగి మంటలు వేసి పండుగకు స్వాగతం పలికారు. గ్రామాల్లో డూడూ బసవన్నల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. హరిదాసులు, ఇళ్ల ముంగిట మహిళలు రంగవల్లులు దిద్దారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. మండలంలోని బలుసుపాడు గ్రామంలో గురుధాం ఆశ్రమంలో తాత్వికుడు గెంటేల వెంకట రమణ ఆధ్వర్యంలో భోగి మంటలు, చిన్నారులకు భోగి పండ్లు పోసి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పేటలోని అలంకార్ థియేటర్ సెంటర్‌లో పిండివంటలు చేస్తున్న మహిళలు



జగ్గయ్యపేటలో భోగి మంటలు వేస్తున్న ప్రజలు



నందిగామ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన భోగి మంటలు



పేటలోని బలుసుపాడు సెంటర్‌లో గంగిరెద్దుల విన్యాసాలు

సంప్రదాయ కోడి పందేలు ప్రారంభం..

జగ్గయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగ సంప్రదాయమైన కోడి పందేలను నిర్వాహకులు ప్రారంభించారు. కోడి పందేల నిర్వహణకు నిషేధం ఉన్నప్పటికీ సంప్రదాయంగా వేస్తుండటంతో సరదాగా గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలోని అనుమంచిపల్లి, తిరుమలగిరి, బూదవాడ, గండ్రాయి గ్రామాల్లో సంప్రదాయ కోడి పందేలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

ఘనంగా భోగి

జగ్గయ్యపేట అర్బన్: సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా పట్టణంలో శనివారం భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలు వేకువ జామునేలేచి భోగి మంటలు వేశారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బంధువులు, స్నేహితుల రాకతో ప్రతి ఇంట్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా ప్రతి వీధి రంగు రంగుల రంగవల్లులు, గొబ్బెమ్మలతో నిండిపోయి అందంగా తయారయ్యాయి. వీధుల్లో హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు దర్శనమిచ్చాయి. చిన్నారులు ఆనందంతో గాలిపటాలు ఎగరవేస్తూ ఉల్లాసంగా గడిపారు. పలు చోట్ల మహిళలు చిన్నారులకు భోగిపండ్లు పోస్తూ వారిని ఆశీర్వదించారు.

- పాత వేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి సంబరాల్లో భాగంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.
- శ్రీరంగనాయకస్వామి ఆలయంలో భోగి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు టీఎల్ఎన్ ఆచార్యులు, ఆలయ ధర్మకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కంచికచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో భోగి మంటలు వేశారు. తెలుగు లోగిళ్ల ముంగిట రంగు రంగుల ముగ్గులతో ఆడపడుచుల సందడి చేశారు.

ప్రజలు ఆనందంగా జీవించాలి

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ ప్రజలకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద సంక్రాంతి పండగ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి వారు గాలిపటాలను ఎగరవేసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చైర్మన్, వైస్ చైర్మన్లు మాట్లాడుతూ.. ఈ సంక్రాంతి నుంచి ప్రజల కష్టాలు అన్నీ తొలగిపోవాలని, ఆనందంగా అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పందుల రోశయ్య, వట్టెం మనోహర్, నాయకులు తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్, కాటగాని నరసింహారావు, పార్టీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు గుంజ లక్ష్మణ్ పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ ప్రభాకర్ తదితరులు

సంక్రాంతిని సంతోషంగా జరుపుకోవాలి



సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. నందిగామ పట్టణ శివారులోని మామిడి తోటలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, నాయకులు రమేష్, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

కళకళలాడిన వైష్ణవాలయాలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ధనుర్మాసోత్సవాల్లో చివరి రోజు శనివారం వన్‌టౌన్‌లోని పలు వైష్ణవాలయాలు కళకళలాడాయి. ధనుర్మాసోత్సవాలను భోగిపండగతో ముగింపు పలకడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆయా ఆలయాల్లో శనివారం గోదాదేవి రంగనాయకస్వామి వార్లకు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు కనులపండువగా నిర్వహించారు. వన్‌టౌన్‌లోని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను ముస్తాబు చేసి విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వన్‌టౌన్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీనగరాల సీతారామస్వామి దేవస్థానం, సైకం వారివీధిలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానం, సత్యనారాయణస్వామి ఆలయం, కొత్తగుళ్ల ప్రాంగణంలోని పాండురంగస్వామి ఆలయం, రామాలయం, భావనారాయణవీధిలోని కోదండరామస్వామి వారి దేవస్థానం తదితర ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచి బారులు తీరారు. ఉత్సవమూర్తులకు ఉదయం నగరోత్సవాలు నిర్వహించారు.



పాండురంగడికి చందనాలంకారం

గ్రైండర్ అందజేత

ఇబ్రహీంపట్నం : గుడ్ సమరిటన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రేమ్ నికేతన్ (దివ్యాంగుల సేవాసంస్థ)కు గ్రైండర్‌ను శనివారం అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు చిట్టేలు కోటేశ్వరరావు సంస్థ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యురాలు శశి జన్మదిన వేడుకలు దివ్యాంగుల మధ్య ఉత్సాహంగా నిర్వహించారు. వారికి కేక్‌లు, స్వీట్లు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. ట్రస్ట్ కార్యదర్శి వేల్పుల రాజేష్, సభ్యులు హరీష్, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



గ్రైండర్ అందజేస్తున్న గుడ్ సమరిటన్ ట్రస్ట్ సభ్యులు

సర్వ మానవాళిలో భగవంతుడిని చూసుకోవాలి



విజయవాడ కల్చరల్: సర్వమానవకోటిలోనూ భగవంతుడిని చూసుకోవాలని అదే మహర్షులు మనకు అందించిన దివ్యసందేశమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త నరసింహాచార్యులు ఉపదేశించారు. శ్రీ కంచికామకోటి పీఠం ఆధ్వర్యాన లబ్బీపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాలు శనివారం ముగిశాయి. నరసింహాచార్యులు మాట్లాడుతూ శివ కేశవులకు భేదం లేని మాసం ధనుర్మాసమని వివరించారు. గోదాదేవి రంగనాథుని ప్రసన్నం చేసుకోవడానికి పాశురాలను రచించి గానం చేసిందన్నారు. పాశురాలను తిరుప్పావైగా కూడా సంభాషిస్తారన్నారు. వాటి పఠనం శ్రవణం ముక్తికి మార్గంగా భావిస్తారన్నారు. నెల రోజుల పాటు ధనుర్మాసం సందర్భంగా భగవత్ కైంకర్యంలో పాల్గొన్న అర్చక స్వాములను భక్తులు ఆత్మీయంగా సత్కరించారు.

ఘనంగా సినీనటుడు శోభన్‌బాబు జయంతి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏలూరు లాకుల సెంటర్‌లో స్టేట్‌వైడ్ శోభన్ సిండికేట్ ఆధ్వర్యంలో సినీ నటుడు శోభన్ బాబు 87వ జయంతి కార్యక్రమం జరిగింది. స్టేట్ వైడ్ శోభన్ సిండికేట్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కొల్లిపల్లి మధుసూదనరాజు, డాక్టర్ డి.సత్యనారాయణలు శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పైడిపాటి వెంకన్న, ఆర్టిస్ట్ వెంకన్న, సలీం, ఎక్స్‌రే కార్యదర్శి బి.ఆంజనేయ రాజు, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ పాల్గొన్నారు.

కమనీయం.. గోదా రంగనాథుల కల్యాణం



పల్లగిరి గుట్టపై గోదా రంగనాథస్వామి కల్యాణం

నందిగామ: మండల పరిధిలోని పలు ఆలయాల్లో గోదా రంగనాథ స్వామి కల్యాణం శనివారం కనుల పండువగా జరిగింది. పట్టణంలోని నెహ్రూ నగర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయంలో, పట్టణ శివారులోని పల్లగిరి గట్టుపై కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, మాగల్లులోని మదనగోపాలస్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం కనుల పండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

త్రిశక్తిపీఠంలో అమ్మవార్లకు విశేష పుష్పార్చన



పుష్పార్చనకు సిద్ధం చేసిన పూలతో ఆలయ కమిటీ సభ్యులు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): బస్టాండ్ సమీపంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో వేంచేసి ఉన్న శ్రీమహాకాళి, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు శనివారం విశేష పుష్పార్చన నిర్వహించారు. భక్తులు సమర్పించిన వివిధ రకాల పుష్పాలతో ఆలయ ప్రధానార్చకుడు వ్యాకరణం శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవార్లకు పుష్పార్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పుష్పార్చనలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు భారతుల విజయకిరణ్ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.